# భక్తులు పలురకములు

ఆ ఇరుకైన మహానగరం మదరాసులోని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ రోడ్ మీద—ఇంచుమించు ఫ్లవర్ బజార్ పోస్టాఫీసుకు ఎదుట వైపుగా ఎంత రద్దీవేళలోనయినా, మీ పక్కగానో మీ ముందుగానో మీకు మల్లెనే ఆరోగ్యంగా, మామూలుగా, పంట్లామూ చొక్కా వేసుకుని నడుస్తున్నవాడల్లా ఒక మనిషి హఠాత్తుగా ఆగిపోయి, పిడికిళ్ళను మడిచి కణతల్ని కొట్టుకోవడం ప్రారంభిస్తాడు. వెన్నెముకపూసలలో అన్నిటి కన్న పైనవున్నది కాస్త సడలినట్లుగా అతడిమెడ ముందుకు వెనక్కు ఊగుతుంది; అతడి పెదవులనుండి ఏదో గొణుగుడు ప్రసారమవుతుంది.

ఇవన్నీ చూచి మీరు దిగ్భ్రమపడవచ్చు.

అయ్యో పాపం కుర్రవాడు—ముప్ఫై యేళ్ళయినా లేనివాడు—ఏంజబ్బో ఏమిటోనని మీరు జాలిపడవచ్చు.

తొందరపడకుండా పట్టుమని అయిదునిముషాలు పరికించితే—సరిగ్గా ఆ చోటికి అదే పోస్టాఫీసు ఎదుటవైపుకు రాగానే—అడ్డపంచల వాళ్ళు, గళ్ళచొక్కాలవాళ్ళు, పైజామాలవాళ్ళు, సూట్లవాళ్ళు—అందరూ కూడా ఈ విధమయిన భంగిమలలోకి మారడం మీరు గమనించగలరు.

వీటి అన్నిటికీ కారణం—అన్నది— ఆ ఎడమవైపున రెండు దుకాణాల మధ్య వేంచేసియున్న "పుళ్ళయార్ కోయిల్" —అనగా వినాయకుడి గుడి—గణేష్-జీ-కా-మందిర్-అనికూడా కనుగొనగలరు.

ఇపుడు మీకు అవగతమవుతుంది పై చేష్టలన్నీ భక్తివలన కలిగిన వని.

భక్తి యన్నదాని బహిరంగ స్వరూపాల నిటుల చర్చించిన పిదప–

–లెటస్ కమ్ ఫ్రమ్ ది జెనరల్ టు ది పర్టికులర్–

–అనగా డొంకవదలి తీగకు

–భక్తినుండి ఒక భక్తుడివైపు.

–భారతంనుండి అర్జునుడివద్దకుపోదము.

ఈ కథలో—అర్జునుడి పేరు అరుముహం.

అరుముహానికి ఆరయిదులు నిండలేదింకా. అయిదయిదులు నిండిన సుందరి అమ్మాళ్ ఈ అర్జునుడికి సుభద్ర. అభిమన్యు డవతరించలేదింకా. ఆ 'ఇంకా' వెనక ఎనిమిదేళ్ళున్నాయి మరి.

రైల్వేలో పెద్దసైజు చిన్న—ఆఫీసరు. అతగాడి 'మామి' సుందరి అమ్మాళ్ అక్షరాలా ద్రవిడాంగన. మొహానికి ఎపుడూ వీడని పసుపు, పెద్ద కుంకుమబొట్టు పరావర్తన సూత్రాన్ని అనుక్షణం వల్లిస్తుండే రవ్వలకు ఆమె చెవులూ ముక్కూ మెట్టినిళ్ళు: రెండార్ల పన్నెండు ఇరవైరెండు క్యారట్ల గాజులమధ్య ఆమె చేతులు: గోచిపోసి కట్టిన కంచిపట్టుచీర....

"ఎంగ అత్తుకారి ఇరుక్కా–శే" అని తన జీవిత భాగస్వామినిగా ఆ సుందరి రావడంతో తన భాగ్యంగురించిన ప్రస్తావన వస్తేచాలు—ఆరుముహం 'సెన్‌దమిళ్' పదాలుచాలక 'సంస్కిరుదమ్'నుండీ 'ఆంగిలమ్' నుండీ అరువుతెచ్చుకునేవాడు.

ఇక అరుముహంయొక్క మొహంమీద కొట్టవచ్చినట్లు కనబడేవి రెండు.

అవి, ఒకటి—ఆరింట ఒక వంతుగా నెరిసిన, నెరుస్తున్న హేండిల్ బార్ మీసాలు.

రెండు—నల్లటి నుదుటి కడ్డంగా తెల్లటి విభూతిరేఖలు. ఆ రేఖల మీద అంపశయ్యమీద భీష్మాచార్యులవలె గంధపు పరిధిలో కుంకుమబొట్టు.

'చెన్నైలో' వున్నన్నినాళ్ళూ ఆరుముహం రోజూ పొద్దున్న లేచి స్నానాదికాలు ముగించి—అరమైలుకవతలవున్న 'కర్పహ వినాయగర్ కోయిల్'కు వెళ్ళి గుంజిళ్ళు అరుతీసి మరీ ఇంటికివచ్చి పూజచేసుకునే వాడు. ఏ కొత్వాల్ చావడికనో వెళ్ళినపుడెల్లా ఫ్లవర్ బజార్ పోస్టాఫీసు ఎదుట ఆ పుళ్ళయార్ కోయిల్‌కువెళ్ళి భక్తి ప్రదర్శించి పావలాకాసును హారతిపళ్ళెంలో పడేసి, ఇరవై పైసలు వెనక్కు—తీసుకుని, వాటిలో సత్తువి ఏవీలేకుండా జాగ్రత్తపడి బస్సెక్కే-వాడు.

కాని ఈ వెధవముండా ఢిల్లీనగరంలో వినాయహర్ కోవిలలు అన్ని లేవు. ఊరంతా వెతికితే ఒకటి రెండుంటాయేమో. ఆరుముహం వుంటున్న కరోల్బాగ్‌లోనయితే అసలే లేదు. వచ్చిన మొదటి అయిదారునెలలలో రోడ్డుప్రక్క-గా పొట్టిగా చీకటిగా ఏదన్నా కనబడగానే గుంజిళ్లు తీయ బోయేవాడు ఆరుముహం. ఇప్పుడు సర్దుకున్నాడు.

అందువలన తిన్నగా ఆ పూజనేదో ఇంట్లోనే ముగించుకుని ఆ తర్వాత వెండికప్పులలో కొంత కాఫీపోసి దానిమధ్యగా పాలకడలిలో పడున్న పరంధాముడివలె కాఫీనిండిన ఒక వెండిలోటానుంచి మామితెచ్చిన దానినందుకుని, ఆ కాఫీని కప్పులోంచి లోటాలోకి, లోటాలోంచి కప్పు లోకి మారుస్తు మధ్యమధ్య రెండింటిలోనుంచి నోట్లోకి పోసుకుంటూ, ఆ ముందుదినం 'హిందూ' పత్రిక చదువుతూ మిగతవాటితోపాటు విన్నటి దినం మద్రాసు మహానగరంలో ఏయే సమావేశాలు జరుగుతున్నాయో, ఏయే సినిమాలు ప్రదర్శింపబడ్డాయో శ్రద్ధగా చూస్తుండేవాడు.

మధ్యమధ్య ఎపుడయినా తాముంటున్న మేడమీది కిటికీనుండి—ఎదుటవున్న పార్కు-లోకి చూచేవాడు.

ఆ పార్కుచుట్టూ నాలుగువైపులా కలిపి పద్దెనిమిదిళ్లున్నాయి ఆరుముహం ఇల్లు తూర్పుదిశనుంది. ఆ ఇంటి యజమాని ఎక్కడో మలయాలో వుంటున్నాడు. వాడి గుమస్తా ఒకడు ప్రతీనెలా అయిదవ తారీకున అద్దెలకోసం వస్తుంటాడు. నిజానికి యజమాని వాడేననుకోవాలి. ఇంటి అద్దెలను పెంచడం వాడిహాబీ; కానీ మలయాలోవున్న ఇంటివాడికి మాత్రం 1948 రేటుప్రకారం అద్దెలు ముడుతుంటాయి ఆ తేడాలతో ఈ గుమాస్తాపేరట మూడు మేడలు వెలిశాయంటుంటారు. ఏమయితేనేం తనకోవాటా కావల్సివచ్చినప్పుడు వాడిచుట్టూరా చేసినన్ని ప్రదక్షిణలు తాను మైలాపూరు కపాలేశ్వర స్వామికికూడా చేసివుండనని ఆరుముహం అభిప్రాయం. వాడు త్త 'తిరుట్టుప్పయన్'—దొంగముండాకొడుకు—అన్నదీ ఆరుముహం అభిప్రాయమే.

పోతే—

అలాకష్టించి సంపాదించిన ఆ వాటాయొక్క కిటికీలోనుండి పార్కులో అక్కడక్కడ వున్న పూలులేని మొక్కలు చూస్తూండేవాడు కాఫీ తాగుతూ.

ఒకనాడు పొద్దున వంటింటినుండి ముందుగదిలోకి వచ్చిన సుందరి తన 'మామ' తదేక దీక్షతో బయటికి చూడటం గమనించింది. తన రాకకూడా ఆయనను కదలించలేదు మామూలుగానయితే ఎంత శివ నామ పఠనంలోవున్నా తన బుగ్గమీది బొగ్గుమరకమీదో, తన నడకమీదో ఒక అభిప్రాయబాణంవేయక వదిలేవారుకాదు.

కనుకనే "ఏవిటది అంతలా చూస్తున్నారు?" అని అడిగింది ఆమె.

ఉలిక్కిపడి తిరిగి చూచిన ఆరుముహంయొక్క మొహం నీరు కారింది.

"అదుగో చూడు ఆ అబ్బాయి—" అన్నాడు కళవళపడుతూ. ఇంకా నయం అరక్షణంముందు 'ఆమె' ఇంట్లోకి వెళ్ళిపోయింది. తాను రోజూ పూజించే దేవుడు నిజంగానే వున్నట్లన్నాడు.

సుందరి చూచింది.

అయిదేళ్ల కుర్రవాడు-ఉన్నిదుస్తులలో మరీబొద్దుగా వున్నవాడు, తెల్లటి నవ్వులవాడు ఆ పార్కులో ఎగురుతూ గెంతుతూన్నాడు.

'ఎంత చక్కటి అబ్బాయి! నేనూ వున్నాను ఒక్క నలుసుని కన కుండా' అనుకోసాగింది మామి వంటింటికి వెళ్తూ.

'ఎంత చక్కటి మనిషి! ఇన్నిరోజులనుండి గమనించలేదే' అని మధనపడుతున్నాడు అరుముహం.

ఆమెను చూచిన కళ్ళతో ఈమెనుచూస్తే, కవిత్వం చదివిన తర్వాత సర్కారువారి సర్క్యులర్ చదివినట్లుంది అరుముహానికి.

ఆ అసంతృప్తిని భరించలేక నాయన్మార్ రచించిన పాడల్‌గళ్ పాడుకోసాగాడు అరుముహం.

అది ఆరంభం.

నాలుగు వారాలలో చాలా భోగట్టానే సేకరించాడు అరుముహం.

ఆ లావణ్యవతి జన్మచే పావనమయినది మహారాష్ట్రదేశమట. ఆమె పడినది ఒక నల్లటి, ఎత్తుపళ్ళ మరాటీవాడి పాలిట. వాడేదో ఆఫీసరుట. అకాడికి ఢిల్లీలో ఆఫీసరుకానివా డెవ్వడూలంట.

ఇంతకూ ఆ ఇంతి పేరు ఏమయి యుండనోపు?

మృణాళినీ కులకర్ణియా?

నళినీ దండేకరా?

సురభీ సుక్తాంకరా?

ఆ అపురూప సౌందర్యవతి నామధేయ మేమిటో?

ఒక్క చూపుకోసం వేయిజన్మల తపోఫలం ధారపోయదగిన ఆ లేత నీలపురంగు కళ్ళనుచూస్తే ఆమెను 'నీలా' అని పిలవ్వాలనిపిస్తుంది. కనుక రిఫరెన్సు నిమిత్తం ఆమెను నీలా కరోల్‌బాగ్‌కర్-అనుకో వచ్చు....అని తీర్మానించాడు ఆరుముహం.

ఆనందం అన్నది క్షణికమేనని రుజువు చేయ్యడానికా అన్నట్లుగా -చేదునిజాలు ఎన్నో తెలియసాగాయి ఆరుముహానికి.

ఆ దివ్య సౌందర్యం అంతా తన ఒక్కడి దిక్కు-వరికాదని తెలియ డానికి వారంరోజులు పట్టలేదు. పొద్దుటి వయసు తొమ్మిది గంటలు కాక ముందుగా-'ప్రెస్‌వాలా'కు ఇస్త్రీకి బట్టలివ్వడానికో, తీసుకోవడానికో-కూరలు బేరమాడడానికో-పార్కులో ఆడుతున్న అబ్బాయిని పిలవ డానికో-ఆ నీలనేత్రి ఇంటిబయటకు వస్తూపోతూంటే, తనలాగే ఆ బ్లాకులో కుడి ఎడమల కిటికీలనుండి అంతస్తుల భేదంలేకుండా, వయస్సుల తారతమ్యం అసలే లేకుండా, అన్ని ఇళ్ళల్లోనుండీ జులాయి వెధవలు-కమ్-అడ్డగాడిదలందరూ అదేపనిగా ఆమెను చూడడం గమనించాడు ఆరుముహం.

ఆవిడేం బజారు మనిషా? ఆమె ఒక పిల్లవాడితల్లి; ఒక ఆఫీసరు భార్య. ఇవన్నీ మరచి అట్లా సభ్యతలేకుండా అట్లా ఎగబడి నిరీక్షణులై నిట్టూరుస్తారేం పీనుగలూ? కళ్ళుఅంటూ రెండున్న ప్రతివాడూ-పొద్దున్న లేచి పళ్ళుతోముకోవడం స్నానంచెయ్యడం ఇంత సంధ్యవార్చుకోవడం అంత పూజచేసుకోవడం-ఇవేమీలేకుండా ఆ పళంగా వార్నిషుకుమల్లే ఆ కిటికీ పూచలకు అతుక్కుపోవడమే? వెధవదేశంలో వర్షాలు సరిగా ఎందుకు పడవు అంటారూ, ఇట్లాటి భ్రష్టులుండడం మూలాన్నే.

అనుకుంటుండేవాడు ఆరుముహం రోజూ పొద్దున్నే కిటికీ ప్రక్కగా నిల్చున్నపుడు.

ఆఫీసుకు వెళ్ళడం, రావడం జరుగుతూంది. సుందరి మామిచేతి కాఫీకప్పులు కప్పులు కప్పులు చప్పుడులేకుండా లోపలికి వెల్తున్నాయి. శివపెరుమాన్, వడివేలన్, వినాయహర్, అంబిగై—ఆ పూజాలు యధా విధిని సాగుతున్నాయి. కాని ఆరుముహం ఆలోచనలో ఆటుపోట్లు ఎక్కువ కాసాగాయి.

క్రమంగా ఆరుముహం అనుకోసాగాడు.

ఇంతకూ ఆ నీలానే అనాలి. సంసార స్త్రీకదా వెన్నపూసలాటి ఆ జబ్బల నందరికీ చూపిస్తూ ఆ భుజాలవరకు రవిక లేవిటీ అంట? అంత అందమూ ఇచ్చిన భగవంతుడు బుద్ధి విషయంలో లోభిత్వం చూపించాడు లేకపోతే అంత నల్లటి అందమైన జుట్టును చక్కగా జడో, ముడో వేసుకోక శివుడి జటాజూటంలాగున అంత ఎత్తున్న ఆ శిఖ ఏమిటి?.... ఏ సెలూన్ వెధవో ఆమెను ముట్టుకుని ఆ జుట్టునట్లా అమర్చివుంటాడు. అట్లా పరాయిమగవాళ్ళ స్పర్శను భరించే ఆడది ఏపాటి ఆడది! అయినా ఆ మొగుడు ముండాకొడుకయినా చెప్పి యేదవరాదూ—సున్నితమైన ఆ పెదాలకు ఆ వికృతమయిన రంగేవిటి?

ఛీ.... ఛీ.... బుద్ధిలేని మనిషి.... వాసనలేని పువ్వు.

అయ్యోపాపం.... ఆ అంత అందమూ నీతినియమమూలేకుండా వ్యర్థమవుతున్నది. ఒక నిష్ఠ, ఒక ఆచారం, ఒక భక్తిలేకుండా ఏం బ్రతుకది.... నలుగురు తన్ను చూడగానే సరిఅనుకునే ఆ మనస్తత్వాన్ని చూసి జాలిపడాలి. అంతే....

అంతేకాదు—ఒకనాటి సాయంకాలం ఆఫీసునుండి వస్తుండగా ఆరుముహం చూశాడు నీలాను.

ఆమె కళ్ళు ఎవరితోనో మాట్లాడుతున్నాయి. తీరాచూస్తే ఆ పసుపు మేడలోని ఆ ఉంగరాలజుత్తు వెధవ అఘోరించాడు.... శివ శివా! లోకానికి కళ్ళులేవని కాబోలు వాళ్ళ భావన....

ఆరుముహం సాయంత్రం పూజచేస్తుంటే పార్వతికి బదులు నీలా కనబడింది. ఆ రాత్రి కలలో ఆ ఉంగరాలజుత్తు దిష్టిపిడతా తానూ హోరా హోరీ పోరాడుతుండగా మెలకువవచ్చింది. భయంతో నన్ను పొదివి పట్టుకున్న సుందరిని చూచి 'నీలా' అన్నాడు నిద్రమత్తులో.

"అవును పౌర్ణమి కదండీ ఇవాళ—" అంది సుందరి_అర్థమయీ కాకుండా.

'నీలా' అంటే తమిళంలో వెన్నెల అని అర్థం వుండడంవలన రాత్రి బోలెడు మేలు జరిగింది.

మరునటిరోజు మాణిక్కవాచగర్‌ని వల్లిస్తూ కాఫీ గ్లాసుతో కిటికీదగ్గర నిల్చున్నప్పుడు_నీలా వచ్చింది వీధిలో కూరలు కొనడానికి.

....ఆ కూరలవాడితో మాట్లాడుతూ పవిటను చూసుకోదేవిటి.... ఆ వెధవాయి త్రాసుచూడ్డం మానేసి....

ఆమె అంటే జుగుప్స కల్గింది ఆరుముహానికి.

కొన్నివారాల తర్వాత ఒక ధనుర్మాసపు ఉదయాన, కరోల్బాగు లోని దాక్షిణాత్య భక్త బృందం భజన చేసుకుంటూ వీధులవెంబడి వెళ్తుం డగా....పూజ ముగించి, చేతిలో కాఫీ గ్లాసుతో కిటికీని చేరిన ఆరుముహం చేతినుండి కాఫీగ్లాసు క్రిందపడింది!

ఆ భజనబృందం పార్కు మూలకు రాగానే, బయటికివచ్చి వారి చుట్టూ ప్రదక్షిణచేసి పళ్లెంలో డబ్బుపడవేసి, కుంకుమ నందుకుని నొసట దిద్దుకుని, వీధిలో ఆడుకుంటున్న అబ్బాయిని లాక్కొచ్చి వాడి చేత నమస్కారం చేయించి వాడికి విభూతి పెట్టించి లోపలికి వెళ్ళింది నీలా!

....కాఫీగ్లాసుపడ్డ చప్పుడువిని ముందుగదిలోకివచ్చిన సుందరిని చూచి "జారింది" అన్నాడు ఆరుముహం.

_వీధిలో పాటవిని తొంగిచూచింది సుందరి. ఆసరికే వీధిలోకి వచ్చిన నీలా పార్కు పక్కగా నిల్చుని ఆ వుంగరాలజుత్తువాడితో మాట్లాడుతూంది.

"అదిగో చూశారూ ఆవిడ...వాళ్ళనాన్న పూనాదగ్గర ఏదో ఆశ్రమాన్ని స్థాపించారుట....ఈమెకూడా లలితా ఉపాసకురాలట. అతడు ఆమె తమ్ముడు, ఆ పసుపుమేడలో ఎర్రదుద్దులమ్మాయి వుందే దాని మొగుడు. ఈ అక్కా తమ్ముళ్ళను చూచినప్పుడల్లా మా సుబ్రమణి గుర్తొస్తుంటాడు" అని ఏవిటేవిటో గడగడ చెప్పేసింది సుందరి.

_మళ్ళీ ఆరుముహం శివపూజ మొదలెట్టడానికి ఆరువారాలు పట్టింది.

– ఆరువారాల తర్వాత ఒకనాడు పార్వతీదేవికి నమస్కరిస్తూ–

"అమ్మా! మళ్ళీ ఆయుస్ను ఇచ్చావు. మాతృత్వాన్ని ఇచ్చావు. నా పాపకు నీ పేరు పెట్టుకుంటానమ్మా!" అని చెప్పుకుంది సుందరి.

('సైనిక సమాచార్' జనవరి 67)